జపాన్ జానపద గాథ

# బాతుల కోసం వల

**- పుష్కమి**

చాలాకాలం క్రితం జపాన్‌లో టారో అనే రైతు వుండేవాడు. అతను ఓ బీడుభూమిలో నివసిస్తుండేవాడు. ఆ ప్రాంతమంతా బాగా తడిగా వుండేది. అక్కడ వుండే పురుగులు, కీటకాలు తినడానికి వందలాది బాతులు వస్తుండేవి.

టారో దగ్గర ఓ చిన్న వల వుండేది. దానితో రోజుకి ఓ బాతుని అయినా పడుతుండేవాడు.

అయితే టారో చాలా అత్యాశాపరుడు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఓ బాతు చిక్కుతున్నా సరిపెట్టుకోలేదు.

రాత్రివేళల్లో ఇంట్లో మంచం మీద పడుకుని కిటికీలోనుంచి బయట కనబడుతున్న నక్షత్రాలను చూస్తూ రకరకాల ఆలోచనలు చేస్తుండేవాడు.

ఓ పెద్ద వల తయారుచేసి, ఆ ప్రాంతంలో ఎగిరే బాతులన్నింటిని పట్టాలని, వాటిని ఓ పెద్ద పంజరంలో బంధించాలని కలలు కనేవాడు. పైగా రోజూ ఓ బాతుని కాకుండా, వాటిలో నుంచి కావాల్సినన్ని బాతులు తినాలని ఆశపడేవాడు.

చివరకి చాలా రోజులు కష్టపడి ఓ పెద్ద వల అల్లాడు టారో. ఆ వలని లావుపాటి మోకుతో కొట్టాడు.

ఒకరోజు ఉదయాన్నే ఆ వలని ఒక చోట పరిచి, ఒక చెట్టు చాటున నక్కాడు టారో. అతని చేతిలో వల తాడు వుంది.

టారో ఎంతోసేపు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండానే వందలాది బాతులు ఎగురుకుంటూ వచ్చి, వల వున్నచోట వాలాయి.

ఇక టారో ఆనందానికి అంతు లేకుండాపోయింది. ఎగిరి గంతేసినంత పని చేశాడు.

నెమ్మదిగా వలని దగ్గరకు లాగడం ప్రారంభించాడు టారో.

అయితే హఠాత్తుగా ఆ బాతులు ఆకాశంలోకి ఎగిరాయి. వలకి తాడు కట్టకపోవడం వల్ల, వల కూడా బాతులతోపాటు ఆకాశంలోకి ఎగిరింది.

గట్టిగా తాడు పట్టుకుని వల కిందకు లాగుదామని టారో చాలా తంటాలు పడ్డాడు. అయితే అతని ప్రయత్నం ఫలించలేదు. బాతులు వలని ముక్కున కర్చుకుని ఎగరసాగాయి. వాటి బలానికి, గాలి విసురుకి వల చివర తాడు పట్టుకుని వున్న టారో కూడా ఆకాశంలోకి ఎగిరాడు.

బాతులు కావాలనే చేసినట్లుగా వలని విడవకుండా తమతో కూడా తీసుకెళ్లసాగాయి. గాలిలోకి ఎగురుతుంటే టారోకి కాళ్లూ చేతులూ ఆడలేదు. భయంతో గొంతు పిడచగట్టుకుపోయింది.

బాతులతోపాటు చాలా ఎత్తున ఎగురుతున్నాడు టారో.

బాతులు ఆ చుట్టుపక్కల వున్న దట్టమైన అడవులు, కొండలు, నదులు అన్నింటిపైనా చక్కర్లు కొట్టాయి.

భయంతో వణికిపోతున్న టారో తాడు వదలి కిందకి దూకలేదు. అలాగని పైన బాతులతోనూ కలిసి ఎగరలేదు.




బాతులు అడవులు, కొండలు, కోనలు దాటి చివరకి ఓ పల్లెటూరు చేరుకున్నాయి.

ఆ గ్రామంలో ఓ పెద్ద గుడి వుంది. ఆ గుడి గోపురం చాలా ఎత్తుగా వుంది. తప్పించుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం దొరకదనుకున్నాడు టారో.

వల తాడు వదలి, ఆ గుడి గోపురం పట్టుకున్నాడు టారో.

బాతులు ముందుకి వలతోపాటు ఎగురుకుంటూ వెళ్లిపోయాయి.

గుడి గోపురం పట్టుకు కూర్చున్న టారో కిందకి చూశాడు.

అక్కడనుంచి చూస్తుంటే ఆ వూరిలో ఇళ్లన్నీ బొమ్మరిళ్లలా వున్నాయి.

అక్కడనుంచి ఎలా కిందకు దిగాలో అర్థంకాలేదు టారోకి. ఎంతో భయం వేసింది.

''బాబోయ్... కాపాడండి! చచ్చిపోతాను. కాపాడండి!'' అని అరవసాగాడు టారో.

అతని కేకలు విని, ఆ గ్రామంలో ప్రజలు కొంత మంది గుడి దగ్గరకి వచ్చారు.

గుడి గోపురం పైకి టారో ఎలా చేరుకున్నాడో వారికి అర్థంకాలేదు.

చివరకి వాళ్లంతా కలిసి మాట్లాడుకుని దుప్పటి లాంటి ఓ పెద్ద గుడ్డ తీసుకువచ్చారు. ఆ వస్త్రాన్ని పట్టుకుని, టారో వైపు తిరిగి, ''దూకేయ్... ఇందులో దూకేయ్. నీకు భయమేమీ లేదు. మేము పట్టుకున్నాం'' అని అరిచాడు.

టారోకి ఎంతో భయమేసింది. మోకాళ్లు వణికాయి. కళ్లు మూసుకుని, ధైర్యం తెచ్చుకుని ఆ వస్త్రంలోకి దూకేశాడు టారో.

సరిగ్గా ఆ దుప్పటి మధ్యలో పడ్డాడు టారో. 'అమ్మయ్యా!' అని బయట పడదామనుకునేలోగా, దాన్ని పట్టుకున్నవాళ్లంతా ఆ మూటలో టారోని గట్టిగా కట్టేసి, పైకెత్తి పడేశారు.

'చచ్చానురా బాబోయ్!' అని కేకలేస్తూ దభీమని కింద పడ్డాడు టారో. కళ్లు తెరచి చూసేటప్పటికి అతను తన ఇంటిలోనే మంచం మీదనుంచి నేలమీద పడివున్నాడు.

తనకు వచ్చింది కేవలం కల మాత్రమే అని తెలుసుకుని హాయిగా నిట్టూర్చాడు టారో.

ఆ రోజునుంచి టారో పెద్ద వల తయారుచేయలేదు. బాతుల్ని పట్టుకోవాలని కలలు కనలేదు.

★